క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం


ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

సారవకోట: మండలంలోని తొగిరి గ్రామంలో గల అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణం చేపట్టారు. మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేయండి


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సునీత

నరసన్నపేట: వ్యవసాయ పంటల సూచలను మాట సరే.. పండిన ధాన్యం ఎప్పుడు కొంటారని వ్యవసాయాధికారి సునీతను రైతులు నిలదీశారు. మండలంలోని ఉకలాం, కామేశ్వరిపేటలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పొలాల్లోనే ధాన్యం బస్తాలు ఉన్నాయని, సకాలంలో కొనుగోలు చేయకపోతే ధాన్యం రంగు మారే ప్రమాదం ఉందని మొరపెట్టుకున్నారు. దీనిపై స్పందించిన ఏఓ మాట్లాడుతూ ఇప్పటికే ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, రెండు, మూడు రోజుల్లో ఆదేశాలు వస్తాయని ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. రబీ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. రైతులు చింతల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు


గోకర్ణపురంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

మెళియాపుట్టి: పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు మధుబాబు అన్నారు. గొప్పిలి, గోకర్ణపురం గ్రామాల్లోని వేరుశెనగ పంటను మంగళవారం పరిశీలించారు. పంట దిగుబడి రావాలంటే ఎకరాకు జిప్సం ఎరువు 200 కిలోలు వాడాలన్నారు. అపరాలలో వచ్చే తెగుళ్ల నివారణకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయశాఖ అధికారి ధానకర్ణుడు, సహాయకులు వాసు, పావని, పలువురు రైతులు పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోండి

ఆమదాలవలస: శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల పరిధిలోని పాడి పశువుల మధ్య పోటీ నిర్వహించి, బహుమతులు అందించడం జరుగుతుందని ఆమదాలవలస పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు రోణంకి ఆనందరావు మంగళవారం తెలిపారు. ఈ పోటీలు విజయనగరం జిల్లాలోని తోటపాలెంలో ఫిబ్రవరి చివరి వారంలో నిర్వహిస్తారన్నారు. సాహివాల్, ఒంగోలు, గిర్, రాఠీ, నాటు, జెర్సీ క్రాస్, హెచ్ఎఫ్ క్రాస్ పశు జాతుల పశువుల మధ్య పోటీ నిర్వహించి ఒక్కో జాతి పశువుకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తారన్నారు. ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.40 వేలు, తృతీయ బహుమతి రూ.25 వేలు ఉంటుందన్నారు. పశువులకు వసతి, దాణా, నీటి సౌకర్యం ఉంటుందని, రవాణా సమయంలో బీమా సదుపాయం ఉచితంగా కల్పిస్తారన్నారు. ఆసక్తి గల పాడి రైతులు సమీప పశువైద్యాధికారిని సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


రామకృష్ణను ఆస్పత్రికి తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

నరసన్నపేట: జాతీయ రహదారిపై నరసన్నపేట నుంచి శ్రీకాకుళం వెళ్లే సర్వీసు రోడ్డుకు ఆనుకొని గ్యాస్ గొడౌన్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. జలుమూరు మండలం తలితిరియా లింగాలపాడు పంచాయతీ కైలాసపురం గ్రామానికి చెందిన నూక రామకృష్ణ ద్విచక్ర వాహనంపై శ్రీకాకుళం వెళ్తుండగా అదుపు తప్పడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఎన్‌హెచ్ అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేసి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

అల్లం సాగుతో.. ఆరోగ్య సిరులు


గిరిశిఖర గ్రామం కేరాసింగిలో అల్లం విత్తనాలు పంపిణీ చేస్తున్న కొత్తూరు వెలుగు అసోసియేషన్ సభ్యులు

- అల్లం పండిస్తున్న గిరిజనులు
- రాయితీపై విత్తనాలను పంపిణీ చేస్తున్న కొత్తూరు వెలుగు అసోసియేషన్ ప్రతినిధులు
- అధికంగా కొనుగోలు చేస్తున్న మైదానప్రాంత ప్రజలు

మెళియాపుట్టి: మార్కెట్‌లో హైబ్రీడ్ అల్లం దొరుకుతోంది. దీన్ని అతిగా వాడుతున్నారు. చిన్న వయసులోనే మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధుల బారిన పడుతుండటంతో.. మైదాన ప్రాంత వాసులు గిరిజన రైతులు పండిస్తున్న దేశీ అల్లం, చిరుధాన్యాల వైపు మొగ్గు చూపుతున్నారు. కరోనా తర్వాత అత్యధిక శాతం మంది ఆహారపు అలవాట్లను మార్చుకున్నారని పలువురు వైద్యులు చెబుతున్నారు. ఎటువంటి ఎరువులు ఉపయోగించకుండా గిరిజనులు అల్లం పండిస్తున్నారు. వారపు సంతల్లో విక్రయాలు నిర్వహిస్తున్నారు. పలువురు వ్యాపారులు గిరిజన గ్రామాలకే వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం సహకరిస్తే మరిన్ని ఎకరాలలో అల్లం సాగు చేస్తామని గిరిజన రైతులు చెబుతున్నారు. మెళియాపుట్టి మండలంలోని ఆంపురం, గొట్టిపల్లి, కేరాసింగి, నేలబొంతు గ్రామాల గిరిజనులు, నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోనూ ఈ ఏడాది అధికంగా సాగు చేయడానికి ఆసక్తి చూపారు. పాతపట్నం నియోజకవర్గ వ్యాప్తంగా 1,328 ఎకరాల్లో గిరిజనులు అల్లం పంటను సాగు చేస్తున్నారు. కొత్తూరు వెలుగు అసోసియేషన్ సభ్యులు స్వచ్ఛందంగా అల్లం విత్తనాలను రాయితీపై అందిస్తూ అన్ని విధాలా సహకరిస్తున్నారు.

పాతపట్నం నియోజకవర్గంలో అల్లం పంట (ఎకరాలలో) వివరాలు ఇలా..

మండలం	అల్లం పంట
మెళియాపుట్టి	350
పాతపట్నం	370
కొత్తూరు	380
ఎల్.ఎన్.పేట	10
హిరమండలం	218


గొట్టిపల్లిలో అల్లం సాగు చేస్తున్న గిరిజనులు

పాతపట్నం నియోజకవర్గంలో చిరుధాన్యాలు పండిస్తున్న రైతులు 280 మంది.

1328 ఎకరాల్లో (పోడు భూమి) అల్లం సాగు.

ఆర్థికంగా పురోభివృద్ధి చెందుతున్న గిరిజన రైతులు.

ఎకరాకు రూ.3.50 లక్షల ఆదాయం.

తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం



అల్లం సాగుచేయడానికి పెట్టుబడులు తక్కువ. నేను ఒక ఎకరాలో పోడు వ్యవసాయం చేస్తున్నాను. అల్లం విత్తనాలను కొత్తూరు వెలుగు అసోసియేషన్ సభ్యులు రాయితీపై అందించారు. వ్యవసాయ శాఖ అధికారులు మరింత సహకారం అందించాలి.

– సవర రమేష్, కేరాసింగి, మెళియాపుట్టి మండలం

చక్కగా పండితే మంచి లాభం



మేము దేశవాళీ విత్తనాలు వేసి పండిస్తున్న అల్లానికి గిరాకీ ఉంది. అదేవిధంగా లాభాలు సైతం అధికంగానే వస్తున్నాయి. కుటుంబ సభ్యులందరం కష్టపడుతున్నాం. గతేడాది 50 సెంట్లలో పండించాను. ప్రస్తుతం మరో రెండెకరాలు పండించాలని యోచిస్తున్నాం.

– జన్ని భాస్కరరావు, నేలబొంతు, మెళియాపుట్టి మండలం

అవగాహన కల్పిస్తున్నాం



గిరిజనులు అధిక శాతం మంది అల్లం పంట పండించేలా అవగాహన కల్పిస్తున్నాం. చాలా మంది రైతులకు దీని లాభాలు తెలియజేశాం. రైతులకు ఆర్థిక సహకారం అందించే ఉద్యానవన పంటలే పండించాలి. గిరిజనులతో ప్రాధాన్యత కలిగిన చిరు ధాన్యాలను పండించేందుకు కూడా కృషి చేస్తున్నాం.

– దుక్క శరత్, ఉద్యానవనశాఖ అధికారి, మెళియాపుట్టి మండలం

పార్టీ బలోపేతానికి కృషి


కొత్తూరు: రెడ్డి శాంతికి కృతజ్ఞతలు తెలుపుతున్న నాగేంద్ర, నాయకులు


హిరమండలం: రెడ్డి శాంతికి కృతజ్ఞతలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని, తనకు పార్టీ అధిష్టానం అప్పగించిన పనులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తానని కొత్తూరు మండలంలోని ఓండ్రుజోలకు చెందిన పార్టీ శ్రీకాకుళం జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి గందవరపు నాగేంద్ర అన్నారు. మంగళవారం పాతపట్నం వెళ్లి మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసినవారికి అధిష్టానం పదవులు కేటాయించినట్లు రెడ్డి శాంతి తెలిపారు. కొత్తూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, గ్రామ సచివాలయం మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, పార్టీ నాయకులు సవర రమేష్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కృతజ్ఞతలు..

ఎల్.ఎన్.పేట: పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి ఎల్.ఎన్.పేట మండల నాయకులు మంగళవారం పాతపట్నంలోని ఆమె స్వగృహానికి వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు. గొట్టిపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ శిమ్మ సాంబశివరావును పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా, కోవిలాం గ్రామానికి చెందిన లోచర్ల మల్లేశరరావును జిల్లా కార్యదర్శిగా నియమించారు. తమ సేవలను గుర్తించిన పార్టీ సముచిత స్థానం కల్పించిందన్నారు. ఇందులో పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కృషి ఎంతో ఉందన్నారు. పార్టీ బలోపేతం కోసం నిరంతరం కష్టపడి పనిచేస్తామన్నారు. ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, పార్టీ మండల ప్రెసిడెంట్ పెనుమజ్జి విష్ణుమూర్తి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, పార్టీ నాయకులు ఈగల చిన్నారావు, తొత్తడి మణికంఠ, తలసముద్రం శోభన్‌బాబు, తదితరులు ఉన్నారు.

బాధ్యతగా పనిచేస్తా..

హిరమండలం: తనపై నమ్మకంతో వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఇచ్చిన పదవిని బాధ్యతగా నిర్వహిస్తానని పార్టీ జిల్లా కార్యదర్శిగా ఎంపికైన ఏవీ సురేష్ తెలిపారు. పదవి రావడానికి కారణమైన పాతటప్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ, పార్టీ నాయకులు వంగపల్లి చిన్నారావు, మీసాల శ్రీనివాసరావు, లుకలాపు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సదరం క్యాంప్‌లు


పాతపట్నం: దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు చిన్నంనాయుడు


నరసన్నపేట: దివ్యాంగుల సర్టిఫికెట్ల శిబిరాన్ని పరిశీలిస్తున్న డీసీహెచ్ కల్యాణ్‌బాబు

పాతపట్నం: స్థానిక సీహెచ్‌సీలో సదరం క్యాంప్‌ను కొనసాగిస్తున్నారు. మంగళవారం కొత్తూరు మండలంలోని పొంటూరు సచివాలయ పరిధిలోని దివ్యాంగుల సర్టిఫికెట్లను పునః పరిశీలన చేసినట్లు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ కె.కృష్ణారావు తెలిపారు. ఆస్పత్రికి వచ్చిన ఆర్థోపెడిక్ రెడ్డి చిన్నంనాయుడు దివ్యాంగులకు వైద్య పరీక్షలు చేశారు. సర్టిఫికెట్లను పరిశీలించి ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేశామన్నారు.

పరిశీలన..

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ శిబిరాన్ని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి కల్యాణ్‌బాబు మంగళవారం పరిశీలించారు. ఆర్థో నిపుణులు యశస్వినితో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వెరిఫికేషన్ పూర్తి చేయాలని సూచించారు. ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. శిబిరానికి వచ్చిన దివ్యాంగులకు తగిన సౌకర్యాలు కల్పించాలని ఆస్పత్రి సిబ్బందికి ఆదేశించారు. 51 మంది సర్టిఫికెట్లను పరిశీలించారు.

కేసులను రాజీ చేసుకోవాలి


నరసన్నపేట: మాట్లాడుతున్న సన్యాసినాయుడు

నరసన్నపేట: అనుకోని పరిస్థితుల్లో వివాదాలకు పాల్పడినవారు అనంతరం వాటిని సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని, ఆ దిశగా రిమాండ్‌లో ఉన్న ముద్దాయిలు కూడా కృషి చేయాలని న్యాయ సేవాధికారి సంస్థ జిల్లా అధ్యక్షుడు ఆర్.సన్యాసినాయుడు అన్నారు. స్థానిక సబ్‌జైల్‌ను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జైల్లో ఉన్న పరిస్థితులను రిమాండ్ ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసుకోవాలని సూచించారు. దీని ద్వారా ఎంతో సమయం కలిసి వస్తుందని, మానసిక ప్రశాంతత ఏర్పడుతుందన్నారు. న్యాయవాదుల ద్వారా రాజీకి సంప్రదించాలన్నారు. జైల్లో ఉన్న రిమాండ్ ఖైదీలు న్యాయ సేవాధికారి సంస్థ అందించే ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

న్యాయ సేవలను వినియోగించుకోవాలి..

పాతపట్నం: ఖైదీలు న్యాయ సేవలను వినియోగించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. మంగళవారం పాతపట్నం సబ్ జైల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఖైదీల బ్యారక్‌లు, వంట గదులను తనిఖీ చేశారు. సరుకుల నాణ్యతపై ఆరా తీశారు. ఖైదీల హాజరు, రికార్డులను పరిశీలించారు. సబ్‌జైలర్ ఎం.రాము, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.ఈ.ఈ సత్యనారాయణ, న్యాయవాదులు, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం


ఏవీ సురేష్

హిరమండలం: ఎన్నికల ముందు అమలుకాని హామీలు ఇచ్చిన సీఎం చంద్రబాబు, కూటమి నేతలు నేడు సంక్షేమ పథకాలను అమలు చేయలేక చేతులెత్తేయడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఏవీ సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీ అమలు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలైనా ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయలేదన్నారు. ప్రజలను మోసం చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు. చెప్పిన మాటలకు కట్టుబడి పేదలందరికీ సంక్షేమ పథకాలను అమలు చేయాలని, లేకుంటే ప్రజల ఆగ్రహం చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

పరామర్శ..


సత్యవతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

ఆమదాలవలస: ఆమదాలవలస జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు భార్య సత్యవతి (వంజంగి సర్పంచ్) సోమవారం మృతిచెందారు. అంత్యక్రియలు మండలంలోని వంజంగిలో మంగళవారం జరిగాయి. అంత్యక్రియల్లో శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ పాల్గొన్నారు. సత్యవతి చిత్రపటానికి నివాళులర్పించారు. జెడ్పీటీసీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

డబ్బులు విత్‌డ్రా చేయమంటే.. దోచేశాడు..

పాతపట్నం: మండలంలోని పెద్దమల్లిపురం గ్రామానికి చెందిన కేసారపు నారాయణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం పాతపట్నంలో ఏటీఎంలో డబ్బులు తీయడానికి నారాయణరావు వచ్చారు. డబ్బులు తీయడం రాకపోవడంతో పక్కనే ఉన్న గుర్తుతెలియని వ్యక్తికి ఏటీఎం కార్డు ఇచ్చి డబ్బులు తీయమని చెప్పారు. ఆ వ్యక్తి ఏటీఎం నుంచి డబ్బులను రెండు సార్లు విత్‌డ్రా చేశాడు. ఏటీఎం కార్డును కూడా తస్కరించాడు. నారాయణరావు ఇంటికి వెళ్లి చూడగా రూ.55 వేలు విత్‌డ్రా అయినట్లు తెలుసుకున్నారు. వెంటనే పాతపట్నంలోని బ్యాంకుకు వెళ్లి ఖాతాను చెక్ చేయగా రూ.55 వేలు విత్‌డ్రాతోపాటు ఖాతాలో ఉన్న డబ్బులను పూర్తిగా విత్‌డ్రా చేసినట్లు బ్యాంకు అధికారులు తెలియజేశారు. పోలీస్ స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తిపై నారాయణరావు ఫిర్యాదు చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మండల సమావేశం రేపు

కొత్తూరు: ఈ నెల 30వ తేదీన మండల సమావేశాన్ని ఎంపీపీ సవర సావిత్రి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో బడ్జెట్‌కు సంబంధించిన అంశాలను మాత్రమే చర్చించడం జరుగుతుందన్నారు. ఉదయం 11 గంటలకు సభ్యులు హాజరుకావాలని కోరారు.

అభినందన



ఆమదాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 68వ నియోజకవర్గ క్రీడా పోటీల్లో సరుబుజ్జిలి మండలం కాగితాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు హెచ్ఎం చెంచల తవిటినాయుడు మంగళవారం తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, షటిల్ పోటీల్లో విద్యార్థులు సత్తాచాటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యా కమిటీ చైర్మన్ ఆరవెల్లి సన్యాసిరావు, యోగా ట్రైనర్ తాడేల సాయి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

– సరుబుజ్జిలి

ముమ్మరంగా వరి నాట్లు



ఈ చిత్రం సారవకోట మండలంలోని బద్రి గ్రామం వద్ద రబీ వరి నాట్లు వేస్తున్న మహిళలు. మండలంలోని రంగసాగరంతోపాటు వంశధార ఎడమ కాలువ ఆయకట్టు ప్రాంతాల్లో ప్రస్తుతం వరి నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. గతేడాది డిసెంబర్‌లో కురిసిన వర్షాలతో రంగసాగరంలో నీరు చేరడంతో ఆయకట్టు రైతులు వరి నాట్లు వేస్తున్నారు. వంశధార ఎడమ కాలువ ద్వారా నీరు విడిచిపెట్టడంతో కొత్తూరు, బద్రి, గోపాలపురం, అక్కివలస, లక్ష్మీపురం, బురుజువాడ, జగ్గయ్యపేట, సారవకోట తదితర గ్రామాల్లోనూ వరి నాట్లు వేస్తున్నారు.

– సారవకోట

హెచ్చరిక..



కొత్తూరు మండలంలోని పారాపురం రెవెన్యూ గ్రామ పరిధి గూనభద్రలో గల సర్వే నంబర్ 94–1లో ఉన్న 52 సెంట్ల ప్రభుత్వ స్థలం ఆక్రమణలకు గురైందని గ్రామస్తులు ఇటీవల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ సిబ్బంది మంగళవారం గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టి ఆక్రమణలను తొలగించారు. ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

– కొత్తూరు

తనిఖీ..



విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలని, నిర్వాహకులు నిబంధనలను పాటించాలని డిప్యూటీ కలెక్టర్ లావణ్య సూచించారు. జలుమూరు మండలంలోని రావిపాడు ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులకు సులువైన పద్ధతిలో బోధన చేపట్టాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. హెచ్ఎం జి.సూర్యనారాయణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

– జలుమూరు

అగ్ని ప్రమాదం


మంటల్లో కాలిపోతున్న షెడ్

మెళియాపుట్టి: స్థానిక బండార్లమ్మ వీధిలో ఉన్న కర్లమెంట్‌లో మంగళవారం రాత్రి మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. రాయల మోహన్‌రావు ఆచారికి చెందిన షెడ్‌లో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. స్థానికులు స్పందించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయినా అదుపులోకి రాలేదు. విలువైన కలప, తయారుచేసిన సామగ్రి (కుర్చీలు, ఇతర వస్తువులు) కాలి బూడిదయ్యాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. లక్షల్లో నష్టం జరిగిందని బాధిత కుటుంబీకులు తెలిపారు.

సంక్షిప్తంగా..

సత్కారం


అప్పన్నను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు


బూర్జ: మండలంలోని కె.కె.రాజపురం జెడ్పీ హైస్కూల్‌లో పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్న ఈ.అప్పన్నకు (పీఈటీ మాస్టర్) మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు సత్కరించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా బెస్ట్ పీఈటీ అవార్డును శ్రీకాకుళం సమగ్ర శిక్ష అభియాన్ పీడీ జిల్లా కేంద్రంలో ప్రదానం చేశారు. అప్పన్న సుమారు 15 ఏళ్లుగా విద్యార్థులకు క్రీడల్లో మంచి తర్ఫీదు ఇచ్చినందుకు ఈ వార్డు అందజేసినట్లు పాఠశాల హెచ్ఎం వై.మాలతి తెలిపారు. ఉపాధ్యాయులు, సర్పంచ్ కె.వెంకటసీతారామరాజు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి పనులు ప్రారంభం


రోడ్డు వేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: మండల కేంద్రంలోని హరిదాసు కొనేరుకు వెళ్లేందుకు సీసీ రోడ్డు పనులను సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల లక్ష్మణరావు మంగళవారం ప్రారంభించారు. కొనేరుకు స్నానాలకు వెళ్లిన వారికి సమస్య తీరడంతో సర్పంచ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ యాసిన్

హిరమండలం: మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని స్థానిక ఎస్ఐ ఎండీ యాసిన్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మంగళవారం హిరమండలంలోని పెద్దకోరాడ వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన చేపట్టారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడపడం, పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించడం, హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బోర్లు బాగుచేశారు..

కొత్తూరు: మండల కేంద్రంలోని బీసీ కాలనీతోపాటు పలు వీధుల్లో పాడైన బోర్లును సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో మంగళవారం బాగు చేసి ప్రజలకు తాగునీరు అందజేశారు. ఇంటింటికీ కుళాయిల పైపులైన్ల లీకులను అరికట్టారు.

విరాళం అందజేత


రామాలయం వద్ద విరాళాన్ని అందజేస్తున్న రామరాజు

కొత్తూరు: మండలంలోని పొనుటూరులో సీతారామ మందిరం నిర్మాణానికి పాతపట్నం మండల కేంద్రానికి చెందిన రామరాజు చారటబుల్ ట్రస్టు చైర్మన్ రామరాజు రూ.25 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఆలయ నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు, రిటైర్డ్ వీఆర్వో బలగ అప్పారావునాయుడు, హెచ్ఎం గుర్రాల కృష్ణారావు, కుదుమ తిరమలరావు వి.చంద్రశేఖర్, గుడ్ల పవన్‌కుమార్, పతివాడ శేఖర్ పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ

పాతపట్నం: స్థానిక మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఇంగ్లిష్ లాంగ్ లిట్ క్లబ్‌కు అదే పాఠశాలలో పనిచేస్తున్న వృక్ష శాస్త్ర ఉపాధ్యాయుడు అప్పలరాజు పుస్తకాలను మంగళవారం అందజేశారు. ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారికి ఆక్స్‌ఫర్డ్ సిరీస్ ఇంగ్లిష్ పుస్తకాలను అందించారు. అప్పలరాజును తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

రూ.50 లక్షలతో సీసీ రోడ్డు పనులు

జలుమూరు: శ్రీముఖలింగం గ్రామం ముఖద్వారం నుంచి అమ్మవారికి ఆలయం వరకు రూ.50 లక్షలతో సీసీ రోడ్డు పనులు ముమ్మరంగా చేస్తున్నామని సర్పంచ్ టి.సతీష్ కుమార్ మంగళవారం తెలిపారు. పనులు మరో రెండు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తూరు/హిరమండలం: కొత్తూరు ఎక్సైజ్ శాఖ పరిధిలోని కొత్తూరు, హిరమండలం మండలాలకు చెరో ఒకటి చొప్పున మద్యం దుకాణాలు మంజూరయ్యాయని సీఐ కిరణ్ మణీశ్వరి మంగళవారం తెలిపారు. కొత్తూరు మండలంలోని సెగిడి కులస్తులు, హిరమండలంలో యాత ఉప కులానికి కేటాయించామన్నారు. ఫిబ్రవరి 5వ తేదీలోగా రూ.2 లక్షలను (నాన్ రిఫండబుల్) చలానా తీసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునేవారు తహసీల్దార్‌తో ధ్రువీకరించిన ఉప కులంతో సహా కులధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా అందించాలన్నారు. ఫిబ్రవరి 7న లాటరీ ద్వారా షాపును ఎంపిక చేస్తామన్నారు. జిల్లాలోని గీత కార్మికులు, సెగిడి కులస్తులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. దుకాణానికి రెండేళ్ల కాల పరిమితి ఉంటుందన్నారు.